# ★ విభీషణుని భక్తి ★

శ్రీ మద్దుల లక్ష్మీనారాయణగుప్త

ఒక వర్తకుడు తనకున్న ధనమంతయు పాత్రలలో నింపుకుని, వ్యాపారము నిమిత్తం దక్షిణ సముద్రమున ప్రయాణము చేయుచుండెను

కారణాంతరములచే ఆ పడవ సముద్రమధ్యమున నిలచిపోయెను యెటుకూడా కదలదయ్యె అప్పుడు ఆనావికులు యెంత ప్రయత్నించినను, నిలచినచోటునుంచి కదలలేదు

అప్పుడు ఆ పడవలోని ప్రయాణీకుడు వకడు ఆ పడవకు బలి కావలెనేమో అందువల్ల అట్లు నిలవబడిపోయినది అని చెప్పుచూ అదికూడా మనిషి బలిఅయిన త్వరగా కదలవచ్చును అని తన సలహా ఇచ్చెను

అంత ఆ వర్తకుడు మనిషి బలి ఇచ్చుటకు యెవరు అంగీకరించెదరు? గనుక ఇతర ప్రయాణీకుల సంరక్షణ కొరకు నేనే బలిఅయిన బాగుండునని తలచి, తనవద్దనున్న డబ్బుతో నింపబడిన పాత్రలు పడవనయున్న తన కుమాళ్ళకు వప్పగించి తన అభిప్రాయమును వారికి చెప్పుచుండెను.

కుష్టువ్యాధితో బాధపడుచూ ఇదే పడవలో ప్రయాణముచేయుచున్న మరి వకవృద్ధుడు ఈ వర్తకుని వాక్యములు విన్నవాడై, తనుచాలా కాలమునుంచి కుష్టువ్యాధితో బాధపడుచూ చావు కోరినను చావు రాక, కష్టము భరించలేక ఈ జీవితముపై ఆశలువీడి, మరణమునకు యెదురు చూచుచున్నందున నేను బలి అయ్యెదనని సచించుచూ ఆ సముద్రునికి నమస్కారముచేసి, ఇతరుల సలహాలతో నిమిత్తంలేకుండా వెంటనే ఆ సముద్రములోనికి దూకెను పడవలోని వారందరికి ఆశ్చర్యము కలుగ ఆ పడవ కదలి యథావిధిగా ప్రయాణము చేయసాగెను ఈ సముద్రములోనికి దూకిన వృద్ధుడు కెరటాలలో మునుగుచు తేలుచు లంకాపురము వద్దకు చేరెను. అక్కడ నివసించుచున్న రాక్షసులు నీటిలో కొట్టుకు వస్తూవున్న ఈ వృద్ధునిచూచి మనిషి మాంసము లభించగలదని ఆనందముతో రేవుకు చేరగానే పట్టుకుని, వారి ప్రభువైన విభీషణుని వద్దకు ప్రాణములతో సజీవముగాయున్న ఈ కుష్టువ్యాధి వృద్ధుని తీసుకుని వెళ్ళిరి గొనివచ్చిన రాక్షసులకు తగు బహుమానముల నొసంగి వారిని విభీషణుడు పంపించెను. చలిలో నీటిలో వచ్చిన ఆ వృద్ధుని చంపకుండా, తగు ఉపచరణలు చేసెను. ఆ శరీరమునకు వేడి తగిలిన పిమ్మట కొంతసేపటికి ఆ వృద్ధునికి తెలివి వచ్చెను. అప్పుడు విభీషణుడు తన సింహాసనమున కూర్చుండబెట్టి మహాత్ములకు చేయు సన్మానములన్నియు చేయుచు గౌరవించుచూ, 'మహాత్మా నేను నేడు చాలా అదృష్టవంతుడను, శ్రీరామచంద్రుడే ఈరూపములో నాకు దర్శనము ఇచ్చినట్లు తలంచుచున్నాను. గనుక నా సింహాసనమును మీరు స్వీకరించి ఈ లంకాపట్టణమును మీరు పరిపాలించవలసినదిగా ఆ వృద్ధుని ప్రార్థించెను

అంత ఆ వృద్ధుడు మహా ఆనందముతో 'అయ్యా ఈ రాజ్యముతో గాని, మరి ప్రపంచములోని మరే ఇతరవస్తువు యందైనను నాకు కోర్కెలేదు గనుక నాయందు మీకు అభిమానమున్నయెడల నేను యేపడవలో నుంచి దూకి వచ్చితినో తిరిగి ఆపడవలోకి చేర్చవలసినదిగా కోరెను. అంత విభీషణుడు ఆ వృద్ధునికి పట్టుపీతాంబరములు కట్టి, అనేక రత్నహారములను కానుకగా ఇచ్చి ఆ వృద్ధుని శరీరమునందు అన్నిచోట్ల ముఖముమీద 'రామ రామ' అను అక్షరములుతో అలంకరించి 'ఈ వృద్ధుని ముఖముమీద శరీరమంతయు రామ నామమును లిఖించితిని గనుక శ్రీరామచంద్రుని దయవల్ల ఈ వృద్ధుడు కోరిన స్థలమునకు క్షేమముగా చేరుగాక' యని అని శ్రీరామచంద్రుని ప్రార్థించుచూ ఆవృద్ధుని తిర్గి సముద్రములో ముంచెను. వెంటనే విభీషణుని స్పర్శవల్ల ఈ వృద్ధునికి వున్న కుష్టువ్యాధి యావత్తుపోయి, మంచి శరీరమును పొందెను. కెరటాలలో కొట్టు

(తరువాయి 17 వ పేజీలో)

## విభీషణుని భక్తి

(౩వ పేజి తరువాయి)

కొనుచూ ఆ పడవయున్న చోటికి చేరగా, ఆ పడవలోనివారందరు ఆశ్చర్యపడుచూ నీటిలో దూకిన ఈ వృద్ధుడు ఇక్కడకు యెట్లు చేరితా యని చింతగొనుచు, అతనికి సహాయము చేసి పడవలోనికి లాగిరి. ఈ వృద్ధుడు దైవసంభూతుడు కాని యడల ఇట్లు యేల రాగలడని భావించుచూ, మీరు యెవరు యెక్కడనుండి వచ్చుచున్నారు అని ప్రశ్నించిరి.

నవ్వుచూ, అతడు, "మీతో ప్రయాణముచేసిన కుష్టువ్యాధితో బాధపడుచున్న వృద్ధుడను నేనే, కెరటములు నన్ను లంకాపట్టణమునకు కొట్టుకు వెళ్ళినవి. అక్కడ నివసించుచున్న రాక్షసులు నన్ను పట్టుకుని వారి ప్రభువైన విభీషణుని యొద్దకు గొనిపోయిరి. ఆయన రామభక్తుడు. రాముడే నేడు ఈ రూపమున తనకు దర్శనమిచ్చెనని భావించుచూ, నాకు తగు సత్కారములచేసి తన సింహాసనమును నాకు ఇచ్చి రాజ్యపాలన చేయవలసినదిగా కోరెను. నాకు శరీరము మీద కోరిక లేదనియు, తిర్గి నన్ను నేను ప్రయాణముచేసిన పడవకు చేర్చవలసినదిగా కోరియుంటిని. విభీషణుని స్పర్శవల్ల, వాక్కువల్ల నాకు ఉండుకున్న కుష్టువ్యాధి నశించెను. మామూలు శరీరముగా మారెను. నా శరీరముపై రామనామము లిఖించి, నన్ను తిర్గి సముద్రములో వదిలినంత తిర్గి మీ దరికి చేరగలిగితిని అని చెప్పగా, పడవలోని ఇతర ప్రయాణీకులందరు చాలా ఆశ్చర్యముతోను ఆనందముతోను మునింగి, ఆ విభీషణుడు, యెంత రామభక్తుడు? తన కుల ధర్మమును, సోదరుని వదలి ఆ శ్రీరామచంద్రుని యందు అతని భక్తికి మెచ్చుకొనిరి. శ్రీరామ నామములోని మహత్తును గ్రహించిరి.

—o—

## కవితా !

—తిరునగరి

అల మధూక వనమునందు
ఎల కోయిల గొంతెత్తిన
పుష్పమ్ములు తరువులపై
పుప్పొడులే ప్రసవించిన

భ్రమరుడు సుమ కుంజములో
అమర గానములు చేసిన
జల, జల, నిస్వనములతో
సెలకన్నెయు ప్రవహించిన

హృదిలోపల తాదాత్మ్యము
ఎదియో కలిగించి మధుర
గీతికలను నాచే పా
డింప జేయుదువు కవితా !

జీవితములో దుఃఖములు, నా
భావినే శాసింప బూనిన
పెను విషాద తమస్సులోపల
హృదయమే ద్రవియించిపోయిన

ఆప్తులందరు దూరమై, ఏ
కాంతమే యిక మిగిలిపోయిన
మధురమౌ బంగారు కలలే
మంచు వలెనే కరిగిపోయిన

నా యెదలో దుఃఖమార్ప
నవ వీణలు పలికించుచు
నవ కవితా లోకమ్ములు
నాకు జూపెదవు కవితా !

వర్షఋతువు సోయగాలు
మది నావేశించువాడు
మధు వసంత ఋతుశోభలు
ఎదలో నటియించునాడు

ఈ యనంత సృష్టి నిర్వ
చింప విచారించునాడు
ఏవో ఆశయములతో
నే సత, మత, మైననాడు

నా భావములోపల, నీ
వావేశమ్మంది, నవ్య
కావ్యమ్ములు, నాచే, రచి
యింప జేయుదువు కవితా !

నాలో ఎల్లప్పుడు కింకి
ణీలయలను పలికించుము
నవకవితో ద్యానమ్ముల
నా కెప్పుడు చూపింపుము

నా మదిలో అనారతము
నాట్యమాడు కవితా !

—o—